సాక్షి
మంచిర్యాల

శుక్రవారం । 3 । మార్చి । 2023



స్వేచ్ఛగా బతుకునిద్దాం

జీవవైవిధ్యంలో ఏ ఒక్క వన్యప్రాణి అంతరించి పోయినా అనర్థాలు కలుగుతాయి. అందుకే అడవిలో స్వేచ్ఛగా బతుకునిద్దాం. నేడు ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం. 8లో▸



'108'కు జీపీఆర్ఎస్

మెరుగైన వైద్య సేవలపై ప్రభుత్వం దృష్టి సారించింది. 108 అంబులెన్స్‌లకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తోంది. ఆలస్యానికి చెక్ పెట్టేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
36.0 /19.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలతో ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

5న గురుకుల సీఓఈ సెట్



వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌సీఓ స్వరూపారాణి

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో సీఓఈ సెట్‌ను ఈ నెల 5న నిర్వహించనున్నట్లు సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆర్‌సీఓ కె.స్వరూపారాణి తెలిపారు. గురువారం బెల్లంపల్లి సీఓఈ కళాశాలకు వచ్చిన ఆమె వివరాలు వెల్లడించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సీఓఈ సెట్ నిర్వహణ కోసం 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరంలో సీఓఈలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో 6,719 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు వివరించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి పలు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ నేతల అరెస్టు అప్రజాస్వామికం'



దుకాణాలు బంద్ చేయిస్తున్న సురేఖ

మంచిర్యాలటౌన్: గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన జిల్లా బంద్‌ను పోలీసులు అడ్డుకోవడం, నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన జిల్లా బంద్ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు, నాయకులు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి వ్యాపారసంస్థలు మూసి వేయించారు. సురేఖ మాట్లాడుతూ పోలీసులు ముందస్తుగా పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి బంద్‌ను అడ్డుకోవాలని ప్రయత్నించారని అన్నారు. కూరగాయల మార్కెట్ రోడ్డు వైపు వెళ్తున్న నేతలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని ఖండించారు. డీసీసీ అధ్యక్షురాలిని సైతం పోలీసులు అదుపులోకి తీసుకుని విడిచిపెట్టారు.

'గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే తగ్గించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య డిమాండ్ చేశారు. గురువారం ఎంపీసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పలుమార్లు గ్యాస్ ధరలను పెంచడం తప్పా తగ్గించేందుకు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని అన్నారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలు ప్రజలకు గుదిబండగా మారుతున్నాయని తెలిపారు. ఇటీవల పెంచిన గ్యాస్ ధరను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. గ్యాస్‌ధరను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బెల్లంపల్లిలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు విజయవంతం చే యాలని కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డు నారాయణ, నాయకులు జిలకర వాసు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు



వీధుల్లో తిరుగుతున్న కుక్కలు

జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా తిరుగుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఒంటరిగా బయటకు వెళ్తే చాలు చిన్నా పెద్దా వృద్ధులనే తేడాలేకుండా, ద్విచక్ర వాహనదారులను సైతం వెంటపడి మరీ కరుస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 39 మందిపై దాడి చేసి గాయపరిచాయి. దీంతో తమ పిల్లలను పాఠశాలలకు పంపించేందుకు తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.

జిల్లాలో బాధితులు

నెల	బాధితులు
జనవరి	11
ఫిబ్రవరి	27
మార్చి	1

- స్వైరవిహారం చేస్తున్న శునకాలు
- ఈ ఏడాది ఇప్పటికే 39 మందిపై దాడి
- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు

మంచిర్యాలఅగ్రికల్చర్: కుక్కల సంతతిని నియంత్రించేందుకు అధికారులు సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలు చేపట్టక పోవడంతో సమస్య తీవ్రరూపం దాల్చింది. ఫలితంగా ఏటా కుక్కకాటు బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. గతంలో వీధికుక్కల సంతతి నియంత్రణకు పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ల ఆధ్వర్యంలో ఏడాదికోసారి ప్రత్యేక కార్యాచరణ నిర్వహించేవారు. జంతుప్రేమికుల ఒత్తిడితో మూగజీవాల నియంత్రణకు చర్యలు చేపట్టరాదనే జంతుహింస నివారణ చట్టం ఫలితంగా వారి చర్యలకు విఘాతం ఏర్పడింది. కనీసం వీధికుక్కలు వృద్ధి చెందకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేపట్టాల్సి ఉండగా ఇది ఖర్చుతో కూడుకున్నదని ఈ కార్యక్రమాన్ని అధికారులు అటకెక్కించారు.

విరుచుకుపడుతున్న వీధి కుక్కలు

జిల్లా వ్యాప్తంగా కుక్కలు విచ్చలవిడిగా దాడులకు పాల్పడుతున్నాయి. ఇటీవల భీమారం, హాజీపూర్ మండలాల పరిధిలో, మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, క్యాతనపల్లి, మున్సిపాలిటీ ప్రాంతాల్లో 32 మందిపై వీధికుక్కలు దాడి చేయగా 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. గత నెల 27న మందమర్రి పట్టణంలో ఒక్కరోజే 19 మందిపై కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. ప్రధాన కూడళ్లు, చౌరస్తాలు, వీధిలైట్ల కింద, కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లలో కుక్కలు అధికసంఖ్యలో ఉంటున్నాయి. గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయి. జన సంచారం లేనిచోట, రాత్రి సమయాల్లో చేతిలో కర్రతో లేదా ఇద్దరు ముగ్గురు తోడుగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వీధి కుక్కలను నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ వీధుల్లో విపరీతంగా సంచరిస్తున్నాయని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కుక్కల సంతతి నియంత్రణకు శస్త్ర చికిత్సలు చేయించకపోవడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

పశువులకు రేబిస్ వ్యాధి..

పిచ్చికుక్కలు కరిచిన పశువులకు రేబిస్ వ్యాధి సోకుతుంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 8 పశువులకు రేబిస్ వ్యాధి సోకి మృతి చెందాయి. పిచ్చికుక్కల చొంగ పశువుల గాయాలకు అంటుకున్నా ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి ఎక్కువగా కుక్కల ద్వారా, తక్కువగా పిల్లులు, ముంగీసలు, నక్కలు, తోడేళ్ల తదితర జంతువుల ద్వారా చిట్టెలుక నుంచి ఏనుగు వరకు అన్ని క్షీరదాలకు సోకుతుంది. ఎక్కువగా పశువుల కేంద్ర నాడీమండలాన్ని ఆశించి వ్యాధిగ్రస్తం చేయడం వల్ల పశువుల్లో పక్షవాతం రావడం, తదనంతరం మృతిచెందడం జరుగుతుంది. కుక్క కరిచిన తర్వాత రెండు నుంచి మూడు వారాల తర్వాత వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. ఒక్కోసారి ఐదు నెలల నుంచి ఆరు నెలల సమయం కూడా పడుతుంది. ముఖం, మెడ ప్రాంతాల్లో కరిస్తే వ్యాధి లక్షణాలు త్వరగా బయటపడుతాయి.

పిచ్చికుక్క కాటుతో రేబిస్

రేబిస్ వ్యాధి ప్రాణాంతకమైంది. రోబ్డో వైరస్ వల్ల సంభవించే ఈ వ్యాధి సోకితే మృత్యువు నుంచి బయటపడడం అసాధ్యం. పిచ్చికుక్క కరిస్తే మనుషులతో పాటు పశువులకు రేబిస్ వ్యాధి సోకుతుంది. పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా ప్రతీ సంవత్సరం యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) ఇప్పిస్తే వ్యాధిని అరికట్టవచ్చు. కుక్కల ద్వారా గజ్జి వంటి చర్మ వ్యాధులు కూడా వ్యాప్తి చెందుతాయి.

రేబిస్ నివారణ టీకాలు వేయించాలి



పెంపుడు కుక్కల యజమానులు సకాలంలో రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేయించాలి. మొదటిసారి 30వ రోజు, బూస్టర్ డోసు 90 రోజులకు, ఆతర్వాత ప్రతీ సంవత్సరం రేబిస్ నివారణ టీకాలు వేయించాలి. స్థానిక సంస్థలు, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలు వీధి కుక్కలను పట్టి తీసుకువస్తే కుటుంబ నియంత్రణ టీకాలు వేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– వై.రమేశ్‌కుమార్, జిల్లా పశువైద్యాధికారి

సమస్యల పరిష్కారానికి కృషి

- మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన



ఫోన్‌లో మాట్లాడుతున్న కమిషనర్ గద్దె రాజు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాల్టీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన లభించింది. తాగునీరు, మురికి కాలువలు, దోమలు, పిచ్చికుక్కల స్వైరవిహారం, డబుల్ బెడ్రూం ఇళ్లు రాలేదని, మార్కెట్ ఏరియాలో పార్కింగ్, మరుగుదొడ్ల సమస్యలను ప్రజలు కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ స్పందిస్తూ పలు సమస్యల పరిష్కారానికి అధికారులకు సూచనలు చేస్తూ తన పరిధిలో లేని వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు.

ప్రశ్న: పట్టణంలోని సీఈఆర్ క్లబ్ సబ్‌స్టేషన్ ఏరియాలోని కాలనీ సమీపంలో చెత్త, మార్కెట్ వ్యర్థాలు వేయడం వల్ల దుర్వాసన, విషవాయువులు వెలువడుతున్నాయి. కోతులు, విషపు పురుగులు సంచరిస్తున్నాయి. నివారణ చర్యలు తీసుకోవాలి. – మంజులవాణి, మూడో వార్డు

కమిషనర్: కాలనీ సమీపంలో చెత్త, వ్యర్థాలు వేయడానికి వీల్లేదు. మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి చెబుతాను. ఎవరైనా వేస్తే ఫొటో తీసి వాట్సాప్ చేయండి. చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: సొంతిల్లు లేక అద్దె ఇంట్లో ఉంటున్నాం. భర్త చనిపోవడంతో అద్దె చెల్లించలేక ఇబ్బంది పడుతున్నా. డబుల్ బెడ్రూం ఇళ్ల జాబితాలో పేరు లేదు. ఇల్లు ఇప్పించగలరు.

– రాజనాల సుమలత, గాంధీనగర్

కమిషనర్: జాబితాలో పేరు లేకుంటే సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేయండి. పరిశీలించి అర్హత ఉంటే తప్పకుండా ఇల్లు వస్తుంది.

ప్రశ్న: పాత బస్టాండ్ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనుల వల్ల సమీప నివాసాలపై అధికంగా దుమ్ము పడి రోగాల బారిన పడుతున్నాం. దుమ్ము లేవకుండా నీళ్లు చల్లించాలి.

– జనార్దన్, పాత బస్టాండ్

కమిషనర్: దుమ్ము విషయమై పలు మార్లు నేషనల్ హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. వారు స్పందించకుంటే మున్సిపాలిటీ ద్వారా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పట్టణంలోని రామన్ కాలనీ, హనుమాన్ నగర్‌లో రోడ్డు పాడై కాలనీ వాసులకు ఇబ్బంది అవుతుంది. రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినా పనులు జరుగడం లేదు.

– రవికుమార్, రామన్ కాలనీ

కమిషనర్: కొత్తగా రోడ్లు వేయడానికి మున్సిపాలిటీలో నిధులు లేవు. గతంలో సీఎంఏఫ్‌టీ ద్వారా వచ్చిన నిధులతో పనులు చేశాం. మళ్లీ ఏమైనా నిధులు మంజూరైతే రోడ్డు వేస్తాం.

ప్రశ్న: యాపల్ ఏరియాలో తాగునీరు రాక ఇబ్బంది పడుతున్నాం. మూడు నెలలుగా విద్యానగర్‌లో తాగునీరు సరఫరా కావడం లేదు.

– మౌనిక, యాపల్ ఏరియా, లక్ష్మణ్, విద్యానగర్

కమిషనర్: పట్టణంలో నేషనల్ వే విస్తరణ పనులు జరుగుతున్నందున పైపులైన్‌కు అంతరాయం ఏర్పడి పలు కాలనీలకు తాగునీరు సరఫరాలో ఇబ్బంది ఏర్పడింది. ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేసి సమస్య పరిష్కరిస్తాం. అనివార్య కారణాల వల్ల విద్యానగర్‌కు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. బిల్ కలెక్షన్ చేసినప్పుడు పరిశీలిస్తాం.

ప్రశ్న: కాలనీలోని ఇంటి వెనుక కాలువలు పూడికతో నిండి దుర్వాసన వెదజల్లడమే కాకుండా ఇంట్లోకి మురికి నీరు చేరుతుంది.

– రాధిక, రెండో జోన్

కమిషనర్: రెండో జోన్ సింగరేణి పరిధిలోకి వస్తుంది. సింగరేణి సివిల్ డిపార్ట్‌మెంట్ వారికి ఫిర్యాదు చేయండి. వారు స్పందించకుంటే మున్సిపాలిటీ ద్వారా సింగరేణి అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కరిస్తాం.

ప్రశ్న: పట్టణంలోని కాలనీల్లో కుక్కల బెడద, పందుల సంచారం ఎక్కువగా ఉంది. ఈ మధ్య చాలామంది పిచ్చి కుక్కకాటుకు గురయ్యారు. నివారణ చర్యలు తీసుకోవాలి.

– రాజేంద్రప్రసాద్, విద్యానగర్

కమిషనర్: మంచిర్యాలలోని ఆండాళమ్మ కాలనీలో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. పూర్తయిన తర్వాత కుక్కలను అక్కడ చేర్పి ట్యూబెక్టమీ, వ్యాసెక్టమీ ఆపరేషన్ చేసి నియంత్రిస్తాం. పందులకు ఆవాస కేంద్రం ఏర్పాటు చేసి అక్కడికి తరలిస్తాం.

ప్రశ్న: మార్కెట్‌లో పార్కింగ్, టాయిలెట్స్ సమస్య వల్ల వ్యాపారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే సమస్య పరిష్కరించగలరు.

– మాయ రమేష్, సుంకు నవీన్, మందమర్రి మార్కెట్

కమిషనర్: మార్కెట్ ఏరియాలో పార్కింగ్, టాయిలెట్స్ ఏర్పాటుకు ఖాళీ స్థలం లేదు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మరుగుదొడ్ల ఏర్పాటు కోసం ఆర్ఎంకు స్థలం కోసం రాశాం. మార్కెట్‌లోని ఎస్‌బీఐ ముందున్న ప్రభుత్వ ఖాళీ స్థలం రెవెన్యూ అధికారులు కేటాయిస్తే పార్కింగ్ ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న: బురదగూడెం సమీపంలో నేషనల్ హైవే వారు యాష్ కుప్పగా వేయడం వల్ల గాలి వీచినప్పుడు ఇళ్లపై పడి ఇబ్బందికరంగా ఉంది. ఇక్కడ నుంచి యాష్ కుప్పను తీయించగలరు.

– దుర్గరాజ్, బురదగూడెం

కమిషనర్: యాష్ కుప్ప తీసివేయని ఇది వరకే నేషనల్ హైవే అధికారులకు తెలియజేశాం.

ప్రశ్న: పాలచెట్టు కూరగాయల వ్యాపారులు సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నాం. కనీసం చిన్న షెడ్డులు, వాష్ రూంలైనా ఏర్పాటు ఏయండి.

– దొమ్మెటి పద్మ, పాలచెట్టు ఏరియా

కమిషనర్: పాలచెట్టు ఏరియాలో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్ తాత్కాలికం. ప్రస్తుతం అన్ని వసతులతో రామన్ కాలనీ వద్ద దుకాణాల సముదాయం ఏర్పాటు చేస్తున్నాం. అది అందుబాటులోకి వచ్చాక ఇక్కడే దుకాణాలు ఏర్పాటు చేయాలి.

ప్రశ్న: మందమర్రిలో 1/70 యాక్ట్ ఉన్నా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. నిలుపుదల కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

– ఎంవీ గుణ, మందమర్రి

కమిషనర్: అక్రమ నిర్మాణాలను గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నాం. అక్రమ నిర్మాణాల నివారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశాం. ఆ కమిటీ నేతృత్వంలో చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- నస్పూర్ మున్సిపల్ బడ్జెట్ ఆమోదం



సమావేశంలో కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే దివాకర్‌రావు, అదనపు కలెక్టర్ రాహుల్, చైర్మన్ ప్రభాకర్

నస్పూర్: మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే ఎస్.దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్, జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, ట్రెయినీ కలెక్టర్ గౌతమి, కమిషనర్ రమేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి రూపొందించిన 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.22.82కోట్ల బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కాగితాలకే పరిమితం

మున్సిపల్ బడ్జెట్ కాగితాలకే పరిమితమైందని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ సురిమిల్ల వేణు ఆరోపించారు. బడ్జెట్ సమావేశాల అనంతరం ఆయన మున్సిపల్ కార్యాలయం ఎదుట కౌన్సిలర్లు బొద్దున సంధ్యారాణి, గెల్లు రజిత, శీపతి సుమతి, బండారి సంధ్యారాణి, తెనుగు లావణ్యలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. నిరుపయోగంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు, యథేచ్ఛగా అక్రమ లే అవుట్‌లు, ప్రభుత్వ భూముల కబ్జా, వీధి కుక్కల స్వైర విహారం అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. వేణు మాట్లాడుతూ గత సంవత్సరం బడ్జెట్‌లో ఎమ్మెల్యే, ఎంఎల్‌సీ నిధుల నుంచి రూ.5 లక్షలు కేటాయించగా నేటివరకు ఒక్క రూపాయి నిధులు విడుదల కాలేదని అన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో సైతం రూ.5లక్షలు కేటాయించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై త్వరలోనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ సభ్యులు

నిరవధిక దీక్ష భగ్నం



దీక్షాపరులను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

దండేపల్లి: కడెం ఆయకట్టు, గూడెం ఎత్తిపోతల పథకం కింద పంటలకు పూర్తి స్థాయిలో నీరందక ఎండిపోతుండడంతో దండేపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, రైతు నాయకులు చేపట్టిన నిరవధిక దీక్షను పోలీసులు గురువారం రాత్రి భగ్నం చేశారు. దీక్షాపరుల ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దీక్ష భగ్నం చేసి స్కూల్ బస్సులో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కంది సతీష్ పూర్తిగా నీరసించిపోవడంతో దీక్ష శిబిరం వద్ద ప్రథమ చికిత్స అందించారు.

మూడో రోజు..

నిరవధిక నిరాహార దీక్ష గురువారం మూడో రోజుకు చేరగా శిబిరాన్ని ఇరిగేషన్ ఎస్ఈ సుశీల్‌కుమార్‌దేశ్ పాండే, డీఈలు దశరథం, వెంకటేశం, ఏఈఈలు రాజేందర్, జాకీర్, శ్రీధర్, సంజీవ సందర్శించారు. సాగు నీటిసమస్య తీరిపోతుందని, కడెం నుంచి నీళ్లు వస్తున్నాయని, గూడెం ఎత్తిపోతల కొత్త పైప్‌లైన్ వేసేందుకు కంపెనీ అంగీకరించిందని, దీక్ష విరమించాలని కోరారు. దీక్షాపరులు లిఖిత పూర్వకమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో రైతు నాయకులు, ఇరిగేషన్ అధికారుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. అధికారులు చేసేదేమి లేక వెళ్లిపోయారు.

నీరసించిన దీక్షాపరులు

దీక్షలో కాంగ్రెస్ పార్టీ నాయకులు త్రిమూర్తి, సతీష్, దుర్గప్రసాద్, మల్లేష్, తిరుపతి, మోహన్, నవీన్, మల్లేష్, రమేష్, నగేష్, జంగు, రమణ, సత్యం కూర్చున్నారు. అందులో కొందరు నీరసించిపోవడం, బీపీ లెవల్స్ తగ్గడంతో తహసీల్దార్ హన్మంతరావు పర్యవేక్షణలో వైద్యసిబ్బంది ఎప్పటికప్పుడు పరీక్షలు చేశారు.

బంద్ పాక్షికం..

సాగునీటి సమస్య కోసం కాంగ్రెస్ పార్టీ గురువారం జిల్లా బంద్‌కు పిలుపునిచ్చింది. దీంతో దండేపల్లి మండలంలో బంద్ పాక్షికంగానే సాగింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు దుకాణాలు మూయిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, నాయకుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది.

బాల్య వివాహాలు అరికట్టాలి



మాట్లాడుతున్న సమన్వయకర్త సత్యనారాయణ

జైపూర్: సమాజంలో జరుగుతున్న బాల్య వివాహాలు అరికట్టాలని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తోడ్పాలని, విద్య ద్వారా అందరూ అభివృద్ధి చెందుతారని చైల్డ్‌లైన్ జిల్లా సమన్వయకర్త ముడుపు సత్యనారాయణ, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆనంద్ తెలిపారు. మండలంలోని ఇందారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా సమాజంలో బాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచి దృక్పథాన్ని కలిగి ఉన్నత పౌరులుగా ఎదగాలని, ధైర్యంతో సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. బాలలు ఆపదలో ఉంటే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098కి కాల్ చేయాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత మాట్లాడుతున్న బాలికలు సమాజంలో వివక్షను ఎదుర్కొని ధైర్యంగా ముందుకుసాగాలని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం మంజుల, ఎంపీటీసీ ఆర్కే స్వర్ణసంతోష్, పంచాయతీ కార్యదర్శి సుమన్, ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సమ్మె



సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ ఉద్యోగులు

మంచిర్యాలఅగ్రికల్చర్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె గురువారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భానుమతి మాట్లాడుతూ ఐసీడీఎస్ ప్రైవేటీకరణను ఆపాలని, బడ్జెట్ పెంచాలని, నూతన విద్యావిధానం రద్దు చేయాలని అన్నారు. గత 40 ఏళ్లుగా పని చేస్తూ పేదలకు సేవలందిస్తున్న వారికి కనీస వేతనం, పింఛన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సౌకర్యాలు కల్పించడం లేదని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో అసెంబ్లీ సమావేశంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి అద్దెలు, గ్యాస్‌బిల్లులు, డీఏలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో రాజమణి, శంకరమ్మ, అనురాధ, రాజేశ్వరీ, శారదా, రాధాబాయి, విజయలక్ష్మి, అశోక్, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయాలి

మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఈ నెల 4, 6వ తేదీల్లో నిర్వహించే 'నైతికత–మానవ విలువలు, పర్యావరణ విద్య'కు పరీక్షలు రాయాల్సిందేని డీఐఈవో శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు గైర్హాజరైతే ఇంటర్ మొత్తం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినా మెమోలో నాట్ క్వాలిఫైడ్ అని వస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 4న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు మానవీయ నైతిక విలువలు, 6న పర్యావరణ విద్య పరీక్షలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

క్లుప్తంగా

వరి ధాన్యం లారీ పట్టివేత


లారీతో తహసీల్దార్ ప్రమోద్ కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని పెట్రోల్ పంపు ఏరియాలోని ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి అక్రమంగా వరిధాన్యం తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు తహసీల్దార్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. కౌటాల మండలం ముత్తంపేటలోని ఓ రైస్ మిల్లు యజమాని ప్రభుత్వానికి సంబంధించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ ముద్ర ఉన్న గోనె సంచుల్లో నింపి కాగజ్‌నగర్ మీదుగా సుల్తానాబాద్‌కు తరలిస్తున్నట్లు తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు పెట్రోల్ పంపు ఏరియాలో లారీని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ లారీలో 27 టన్నుల వరి ధాన్యం (800)బస్తాలు ఉన్నాయని తెలిపారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారులతో పాటు అదనపు కలెక్టర్‌కు సమాచారం అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం


పట్టుకున్న ట్రాక్టర్లతో జిల్లా మైనింగ్ శాఖ అధికారి రవిశంకర్, ఆర్ఐ, ఎస్సైలు

బేల: పెన్‌గంగ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ శాఖ అధికారి రవిశంకర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కోగ్దూర్ రెవెన్యూ గ్రామ శివారులోని పెన్‌గంగ నుంచి అక్రమ ఇసుక తరలిస్తున్నారని సమాచారం మేరకు జిల్లా మైనింగ్ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. దీంతో పాటు అక్రమంగా ఇసుక తరలిస్తున్న 9ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్‌గంగలో సరిపడా ఇసుక లేదని, ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతుల్లేవని పేర్కొన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహించి, అక్రమ ఇసుక తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఆర్ఐ ఆనంద్ కుమార్, ఎస్సై కృష్ణకుమార్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన లారీ

నిర్మల్‌టౌన్: పట్టణంలోని గాజులపేట్ సమీపంలో గురువారం ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గాజులపేట్‌కు చెందిన హర్షత్ ఆటోను తీసుకుని వెళ్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో హర్షత్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

పబ్లిక్ నోటీసు

శ్రీ పూసూర్ సత్యనారాయణ రావు, తం: రంగారావు, వృత్తి: న్యాయవాది మరియు వ్యవసాయము, నివాసము: & పోస్టు: & మం: లక్షెట్టిపేట, జిల్లా: మంచిర్యాల అను వారు వారి కుమారుడు అగు శ్రీ పూసూర్ రంగారావు, తం: పూసూర్ సత్యనారాయణ రావు, నివాసము ఇం.నెం. 1-11-251/ఎ, ఫ్లాట్ నెంబరు బి-101, విండ్సర్ అపార్ట్‌మెంట్స్, బృందావన్ కాలనీ, షాపర్స్ స్టాప్ దగ్గర, బేగంపేట్, హైదరాబాద్, ప్రస్తుత నివాసము ఇం.నెం. 1-2/3, పోస్టు మరియు మండలము నస్పూర్, జిల్లా మంచిర్యాల గారికి శ్రీ పూసూర్ సత్యనారాయణ రావు గారి తదనంతరము చెందబోయే అన్ని స్థిరాస్తులకు మరియు చరాస్తులకు తేది: 31-01-2012న ఒక వీలునామా వ్రాయించి రిజిస్ట్రేషన్ జరిపించకుండానే తేది: 17-11-2015 న అనారోగ్యముతో మరణించినారని సదరు వీలునామాను రిజిస్ట్రేషన్ నిమిత్తము ఈ కార్యాలయములో దాఖలు చేసినారు. కావున ఎవరైనా సదరు సాదా వీలునామాను రిజిస్ట్రేషన్ చేయుటలో అభ్యంతరములు ఉన్నట్లయితే వ్రాత పూర్వకముగా ఈ కార్యాలయమునందు నేటి నుండి 8 రోజులలోపు దాఖలు చేయవలసినదిగా తెలియ చేయనైనది.
తేది: 01-03-2023
సం/- ఇట్లు: ఈ.వి.మురళి కృష్ణ
సబ్-రిజిస్ట్రార్, స.రి.కా. మంచిర్యాల


అడవి బర్రెలు


చిరుతపులి


నీలుగాయి

స్వేచ్ఛగా బతుకునిద్దాం

అమాయక జీవులు జీవ వైవిధ్యంలో ప్రత్యేక గుర్తింపు గల జంతువులు.. ప్రకృతి ప్రసాదాలు వన్యప్రాణులు. వాటికి కేటాయించిన స్థలంలో ఉండనిద్దాం. వాటి రక్షణకు బాధ్యతగా పాటుపడుదాం. జీవ వైవిధ్యంలో ఏ ఒక్క వన్యప్రాణి అంతరించిపోయినా అనర్థాలు కలుగుతాయి. అందుకే అడవితల్లి ఒడిలో సేద తీరే వన్యప్రాణులను స్వేచ్ఛగా బతుకనిద్దాం. నేడు ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- ప్రకృతి ప్రసాదాలు వన్యప్రాణులు
- నకల జీవరాశితోనే జీవవైవిధ్యం
- అంతరిస్తే ప్రకృతిపై ప్రభావం
- నేడు ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం


చుక్కల దుప్పులు

జన్నారం(ఖానాపూర్): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని వివిధ అటవీ డివిజన్లలో రకరకాల వన్యప్రాణులు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. ఇందులో చుక్కల దుప్పులు, నీలుగాయిలు, సాంబర్లు, కొండగొర్లు, కృష్ణజింకలు, అడవిపందులు, కుందేళ్లు, అడవిదున్నలు లాంటి శాఖ జంతువులు, అడవికుక్కలు, చిరుతలు, ఎలుగుబంట్లు, నక్కలు, తోడేళ్ల వంటి మాంసాహార జంతువులు ఉంటున్నాయి. జన్నారం అటవీ డివిజన్ వన్యప్రాణుల ఆవాసాలకు చిరునామాగా ఉంది. ప్రకృతి ఒడిలో అలరాడే అమాయక జీవులు వన్యప్రాణులు. వాటి సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నా కొందరు తమస్వార్థం కోసం వాటిని హతమారుస్తున్నారు. జీవ వైవిద్యంలో ఒక జంతువుపై మరో జంతువు ఆధారపడుతుంది. వన్యప్రాణులు అంతరించిపోతే ప్రకృతిపై ప్రభావం పడే ప్రమాదం ఉంది.

వేట నివారణకు ప్రత్యేక నిఘా

అడవిలో ఉంటూ స్వేచ్ఛగా జీవిస్తున్న వన్యప్రాణులపై వేటగాళ్లు పంజా విసురుతున్నారు. వాటిని వేటాడి మాంసాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వేట నిర్మూలనకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వన్యప్రాణులను వేటాడిన వారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. పలువురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అంతేకాకుండా వేటాడితే ఎలాంటి సెక్షన్ల కింద కేసులు నమోదవుతాయి...శిక్షలు, అనర్థాలపై అటవీశాఖ అధికారులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కళాజాత బృందం సభ్యులతో వన్యప్రాణుల రక్షణపై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో మూడేళ్లుగా వేట తగ్గినట్లు కనిపిస్తోంది.

రాబోయే తరాలకు చూపిద్దాం

వన్యప్రాణుల రక్షణను బాధ్యతగా తీసుకుని రాబోయే తరాలకు వాటిని చిత్రాలలో కాకుండా నేరుగా చూసే అవకాశం కల్పించాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉంది. వన్యప్రాణులు అంతరించిపోకుండా కాపాడుకుందాం. అమాయకపు చుక్కల దుప్పులు, చెంగుచెంగున ఎగిరే కొండగొర్రెల అందాలను అంతరించిపోకుండా కాపాడుకుందాం.

గడ్డి క్షేత్రాలు, నీటి వసతులు

వన్యప్రాణుల కోసం అటవీశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. టైగర్‌జోన్‌లోకి పులి ప్రవేశిస్తే సరిపడా ఆహారం అందించేందుకు రకరకాల వణ్యప్రాణుల సంతతి పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా జన్నారం అటవీ డివిజన్‌లో ఎఫ్‌డీవో మాధవరావు చొరవతో 500 హెక్టర్లలో గడ్డి క్షేత్రాలను పెంచారు. వాటికి నీటి సౌకర్యం కల్పించేందుకు 300ల నీటి కుంటలు నిర్మించారు. 20 చోట్ల సోలార్ నీటి పంపులతో కుంటలకు నీటిని వదులుతున్నారు. దీంతో వన్యప్రాణులు ఆహారం, నీరు, ఆవాసాలుగా ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాయి. దీంతోపాటు మూడేళ్లుగా గ్రామాల్లోని పశువులు అడవిలోకి వెళ్లకుండా అటవీశాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పశువులు అడవిలోకి వెళ్తే వాటి అలజడికి వన్యప్రాణులు భయంతో పారిపోయే అవకాశం ఉంటుందని భావించిన అధికారులు పశువుల మేతకు ప్రత్యేక స్థలం కేటాయించారు. కోర్ ఏరియాలోకి పశువులు, ప్రజలు వెళ్లకుండా అటవీశాఖ అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఫలితంగా రెండేళ్లలో వన్యప్రాణుల సంఖ్య రెట్టింపయ్యింది.

బాధ్యతగా తీసుకోవాలి



వన్యప్రాణులు అంతరిస్తే అనర్థాలు కలుగుతాయి. ప్రకృతిలో భాగమైన వన్యప్రాణుల రక్షణ అటవీ అధికారులే కాకుండా అందరూ బాధ్యతగా తీసుకుంటే రాబోయే తరాలకు వాటి గురించి తెలుస్తుంది. అవి స్వేచ్ఛగా జీవించేందుకు సహకరించాలి. వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వాటికి సరిపడా ఆహారం, నీరు, ఆవాసం ఏర్పాటు చేస్తున్నాం.
– సిరిపురం మాధవరావు , డెప్యూటీ కన్జర్వేటర్

స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశానికి ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లోని బోయినపల్లి వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశానికి నాలుగో తరగతి చదువుతున్న గిరిజనేతర విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి వి.నీలిమ, గిరిజన క్రీడల అధికారి బండ జీవరత్నం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 4న శనివారం జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఇందులో గెలుపొందిన విజేతలకు ఈ నెల 14న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు ఆధార్ కార్డు, బోనాఫైడ్, రెండు ఫొటోలతో హాజరు కావాలని వారు సూచించారు.

అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ

నిర్మల్‌చైన్‌గేట్: కేసీఆర్ ఒకరితోనే తెలంగాణ రాష్ట్రం రాలేదని, అమరవీరుల త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ అని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ వినోద్ అన్నారు. మార్చి 10న హైదరాబాద్‌లో తెలంగాణ జన సమితి పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే 'తెలంగాణ బచావో' సదస్సు పోస్టర్‌ను నిర్మల్ జిల్లా కేంద్రంలో టీజేఎస్ నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల వీరోచిత పోరాటం, ఆత్మబలిదానాలు, ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో తెలంగాణ సకల జనుల పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను కేసీఆర్ ప్రభుత్వం మరచిపోయిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణ త్యాగం చేసిన 1200 మంది అమరవీరుల కుటుంబాలను ఆదుకోకుండా 500 మందిని గుర్తించి మిగతా వారిని నిర్లక్ష్యం చేశాడన్నారు. మిగిలిన అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆరెపల్లి రమేష్ కుమార్, మహిపాల్, సాయి, సాయిరాం, కృష్ణ, నరేష్, రమణ, శంకర్, విక్రమ్, సూర్యనారాయణ, అనిల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్


మంచిర్యాలక్రైం: అరెస్టయిన కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్: మంచిర్యాల జిల్లా దండేపల్లిలో గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా పంట పొలాలకు సాగునీరందించాలని ధర్నా చేస్తున్న రైతులకు మద్దతుగా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ జిల్లా బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్ నాయకులు కుర్మ మల్లాగౌడ్, ముత్యాల బాపాగౌడ్, మహేశ్‌ప్రసాద్ తివారి, చెన్న నారాయణ, ఖాలీల్, శ్రీధర్, సురేశ్, సంపత్, శ్రీనివాస్ ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల బైండోవర్

మంచిర్యాలక్రైం: మంచిర్యాలలో 40మంది కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేసి తహసీల్దార్ రాజేశ్వర్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ రాజు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకుల అక్రమ అరెస్టు

లక్సెట్టిపేట: రైతులకు మద్దతుగా పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ తరలించారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్ తెలిపారు. అరెస్టయిన వారిలో వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమెల రాజు, మండల అధ్యక్షుడు పింగళి రమేశ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంకతి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ఎండీ ఆరీఫ్, ఎస్సీ సెల్ సెక్రటరీ గుత్తికొండ శ్రీధర్, మాజీ ఎంపీటీసీ మడిపల్లి స్వామి, నాయకులు సూరం చంద్రమౌళి, రాందేని చిన్న వెంకటేశ్, బోడ రాజు, కోల నాగు, ప్రశాంత్, హాజీ, అగ్గు లింగన్న, మూల కిషన్ గౌడ్, పెరుగు తిరుపతి, తోట చంద్రశేఖర్, అమీర్ ఖాన్, శాఖాన్, రవి, నరసింహాచారి, అయూబ్ ఖాన్, కాంతన్న, కాంద్ర ప్రసాద్, పెట్టం శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.


చెన్నూర్‌లో అరెస్టయిన కాంగ్రెస్ నాయకులు


లక్సెట్టిపేట: పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు

రెండు కార్లు ఢీ..

- ఇద్దరికి తీవ్రగాయాలు


జైపూర్(చెన్నూర్): మండలంలోని ఇందారం రాజీవ్ రహదారిలో గల బ్రిడ్జి వద్ద రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవుపల్లి గ్రామానికి చెందిన కాసర్ల రాజిరెడ్డి, ముస్రా రాజిరెడ్డి గోదావరినదికి పుణ్యస్నానం నిమిత్తం కారులో వచ్చారు. స్నానం చేసి ఇంటికి తిరిగి వెళ్తున్న క్రమంలో కారు యూటర్న్ తీసుకుంటుండగా శ్రీరాంపూర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న మరోకారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఘటనలో ముస్రా రాజిరెడ్డి, కాసర్ల రాజిరెడ్డిలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జైపూర్ మండలం ఇందారం క్రాస్ రోడ్డు వద్ద బైక్‌ను లారీ ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కుందారం గ్రామానికి చెందిన రావుల సాగర్, సుదమళ్ల నవీన్ ద్విచక్ర వాహనంపై మంచిర్యాలకు వెళ్తుండగా గోదావరిఖని నుంచి జైపూర్ వెళ్తున్న లారీ ఇందారం క్రాస్ రోడ్డు వద్ద బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. దీంతో సాగర్, నవీన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

ఉసురు తీసిన అప్పులు

- పురుగుల మందుతాగి రైతు బలవన్మరణం
- ఖరీఫ్‌లో అకాల వర్షాలతో దెబ్బతిన్న పత్తిపంట


చవాన్ రమేశ్ మృతదేహం

ఉట్నూర్‌రూరల్: పంట సాగుకు చేసిన అప్పులు తీర్చలేక రైతు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సుమన్ కథనం ప్రకారం... మండలంలోని హస్నాపూర్‌కు చెందిన చవాన్ రమేశ్(55) తనకున్న ఐదెకరాల వ్యవసాయ భూమితో పాటు మరో 20 ఎకరాలు కౌలుకు తీసుకుని గత ఖరీఫ్‌లో పత్తి పంట సాగుచేశాడు. పంట సాగు కోసం రూ.5లక్షల వరకు ప్రైవేటుగా అప్పులు చేశాడు. అయితే అకాల వర్షాల కారణంగా పంట పూర్తిగా దెబ్బతిని పెట్టుబడి కూడా రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై బుధవారం పంట పొలంలో పురుగుల మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'108'కు జీపీఆర్ఎస్

- మెరుగైన వైద్యసేవలపై ప్రభుత్వం దృష్టి
- 108కి సాంకేతిక పరిజ్ఞానం
- ఆలస్యానికి చెక్ పెట్టేందుకు..


చెన్నూర్‌లోని 108 వాహనం

చెన్నూర్: రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగి ప్రాణపాయ స్థితిలో ఉన్న క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవల కోసం 108 సర్వీసులు పనిచేస్తున్నాయి. మరింత వేగంగా సంఘటనా స్థలాలకు వాహనాలు చేరుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రానున్న రోజుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మొత్తం 52 వాహనాలకు జీపీఆర్ఎస్ సిస్టమ్ అనుసంధానం చేయనున్నారు.

ఆలస్యానికి చెక్...

ప్రమాదాలు జరిగితే ముందుగా గుర్తుకొచ్చేది 108 వాహనమే. అత్యవసర సేవలకు ప్రమాదం జరిగిన వెంటనే 108కు ఫోన్ చేస్తుంటారు. సమాచారం అందగానే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్సలు అందించి సమీప ఆస్పత్రులకు తరలిస్తారు. ఈ మధ్య కాలంలో వివిధ కారణాలతో వాహనం అలస్యమవుతోంది. వాహన ఆలస్యానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని నిర్ణయించింది. వాహనాలలో జీపీఆర్ఎస్ సిస్టమ్‌ను అనుసంధానం చేయడంతో వాహనం ఎక్కడ ఉందో కాలర్‌కు తెలిసిపోనుంది.

వాహనాలకు 5జీ సిమ్‌లు..

ఇప్పటి వరకు వాహనాలలో 2జీ సిమ్‌లు మాత్రమే ఉన్నాయి. దీంతో సిగ్నల్స్ సక్రమంగా అందకపోవడంతో ఇబ్బందులు తలెత్తాయి. సిగ్నల్ సమస్యను అధిగమించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వాహనాలల్లో ఉపయోగించనున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో వాహనాలను అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను వెంటనే ఆస్పత్రులకు తరలించి ప్రాణాలను కాపాడేందుకు ఈ విధానం దోహదపడనుంది. రానున్న రెండు మూడు రోజులలో ఈ విధానం అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది.

కాలర్‌కు వాహన లొకేషన్..

ప్రమాదం జరిగిన వెంటనే కాల్ చేస్తే హైదరాబాద్ కాల్ సెంటర్ నుంచి సంబంధిత 108 వాహనానికి వివరాలు పంపిస్తారు. సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుంటారు. ఇందు కోసం వాహనాలకు ఆధునాతన ఫోన్‌లను ఇవ్వనున్నారు. ఎవరి ఫోన్ నుంచి కాల్ వస్తుందో వారికి లింక్ పంపిస్తారు. లింక్‌ను ఓపెన్ చేస్తే వాహనం ఎక్కడ ఉంది, వచ్చేందుకు ఎంత సమయం పట్టనుందనే సమాచారం తెలిసిపోనుంది. ఈ విధానం త్వరలోనే అందుబాటులోకి రానున్నట్లు తెలిసింది. వాహనల ట్రాకింగ్ విధానంతో వాహనాలు ఏ ప్రాంతాలకు వెళ్తున్నాయో కాల్ సెంటర్ నిర్వాహకులకు తెలియనుంది.

పట్టుబడితే అంతే..!

- ట్యాక్స్ చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలపై కొరడా
- స్పెషల్ డ్రైవ్ పేరుతో తనిఖీలు ముమ్మరం
- లక్ష్య సాధనకు చేరువలో రవాణాశాఖ


వేంపల్లి శివారులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐ వివేకానంద్‌రెడ్డి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): త్రైమాసిక పన్నులు చెల్లించకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై తిరుగుతున్న ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై జిల్లా రవాణా శాఖ కొరడా ఝుళిపిస్తోంది. స్పెషల్ డ్రైవ్ పేరుతో తనిఖీలు ముమ్మురం చేసింది. ఈ నేపథ్యంలో పట్టుబడిన వాహనాలకు ముక్కుపిండి మరీ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. ఎల్లో ప్లేట్ కలిగిన వాహనాలపై ప్రత్యేక నజర్ పెట్టారు. ఈ నెలాఖరులోగా వందశాతం పన్నులు వసూలు చేయాలని రవాణా శాఖకు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. 2022 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు జిల్లా రవాణా శాఖకు ప్రభుత్వం రూ.55.86 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇందులో భాగంగా మార్చి 2 నాటికి రూ.53 కోట్ల వరకు వసూలు చేసారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి నెలరోజుల సమయం ఉంది. కాగా లక్ష్యానికి మించి వసూలు చేసేలా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు.

13 రోజుల్లో రూ.3 కోట్లు..

రవాణా శాఖ ఆర్థిక లక్ష్య సాధనలో ప్రత్యేక డ్రైవ్ చేపడుతోంది. ఇందులో భాగంగా డీటీఓ కిష్టయ్య ఆధ్వర్యంలో కేవలం 13 రోజుల్లోనే రూ.3 కోట్ల వరకు పన్నులు వసూలు చేసారు. జిల్లాలో త్రైమాసిక పన్నుల ద్వారా రూ.39 లక్షలు, జీవిత కాల పన్నుల ద్వారా రూ. 16 లక్షలు, వివిధ రకాల ఫీజుల ద్వారా రూ.43 లక్షలు, సర్వీస్ చార్జీల ద్వారా రూ.9 లక్షలు, వాహనాలకు జరిమానా, అధిక లోడ్, పత్రాలు లేకుండా, డ్రైవర్ లైసన్స్ లేకుండా తిరిగే వాహనాలకు జరిమానా విధించడానికి చేసిన తనిఖీల ద్వారా రూ.50 లక్షలు వసూలు చేసి లక్ష్యసాధనకు చేరువలో ఉన్నారు.

వాహనదారులకు నోటీసులు జారీ..

జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 80 వేల వివిధ రకాల వాహనాలు ఉన్నాయి. ఇందులో సరుకు రవాణా చేసే వాహనాలపై ఏళ్ల తరబడి రోడ్ ట్యాక్స్ పెండింగ్‌లో ఉండడంతో ఆశాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. వాహనాల ఫిట్‌నెస్, పర్మిట్, పొల్యూషన్, లైసన్స్, ఇన్స్యూ డ్రైవింగ్ లైసన్స్ ఇలా ఏఒక్కటి సరిగా లేకున్నా జరిమానా విధించేలా చర్యలు తీసుకుంటున్నారు. పన్నులు పెండింగ్‌లో ఉన్న వాహనాలపై ఏకంగా 200ల శాతం అపరాధ రుసుం విధిస్తున్నారు. జిల్లాలో ప్రజారవాణాకు సంబంధించి 16,359, సరుకు రవాణాకు సంబంధించి 1,938 వాహనాలు ఉండగా ఇతర ప్రైవేట్ బస్సులు 517 ఉన్నాయి. వీటి ద్వారా రవాణాశాఖకు ఏడాదికి ట్యాక్స్ రూపంలో రూ.12 కోట్లకు పైగానే నిధులు సమకూరుతున్నాయి. జిల్లాలో జాతీయ రహదారి ఉండడంతో అత్యధిక లోడ్‌తో, ఎలాంటి పత్రాలు లేకుండా రవాణా సాగిస్తున్న వేలాది వాహనాలపై ఆర్టీఏ శాఖ జరిమానాతో కలిపి పన్నులు వసూలు చేస్తోంది. కోవిడ్, ఆ తర్వాత ఆశించిన స్థాయిలో వ్యాపారాలు జరగక పోవడంతో పన్నులు చెల్లించడంలో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 6 నెలల పాటు పన్నుల చెల్లింపు మాఫీ చేసింది. ఇక ఇప్పుడు వాహనాల పన్నులు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తనిఖీల్లో పట్టుబడితే ఆ వాహనదారులు 200ల శాతం అపరాధ రుసుంతో పాటు 300ల శాతం పన్నులు చెల్లించాల్సి వస్తుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

వాహనాలు సీజ్‌చేస్తాం



ఇప్పటికే 95 శాతంకు పైగా పన్నులు వసూలు చేశాం. విజిలెన్స్‌తో పాటు ఆర్టీఏ బృందాలు అధిక కేసులు రాయడం వలన కూడా రవాణా శాఖకు ఆదాయం పెరిగింది. స్పెషల్ డ్రైవ్‌లో వాహనాలు పట్టుబడితే 200ల శాతం అపరాధ రుసుం వసూలు చేయడంతో పాటు వాహనాలు సీజ్ చేస్తాం. త్రైమాసిక పన్నులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కట్టాలి. వాహనదారులు సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలి.
– ఎల్.కిష్టయ్య, డీటీఓ, మంచిర్యాల

ఆదిలాబాద్‌లో డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రం


ఆదిలాబాద్‌లోని ప్రధాన తపాలా కార్యాలయం

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలాకార్యాలయంలో డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఆదిలాబాద్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.ఉమామహేశ్వర్ తెలిపారు. దీని ద్వారా విదేశాలకు పార్శిల్స్ పంపుకోవచ్చని వివరించారు. రాష్ట్రంలో మూడు ప్రధాన తపాలా కార్యాలయాలకు ఇది మంజూరు కాగా అందులో ఆదిలాబాద్ ఒకటని పేర్కొన్నారు. చిన్న, సూక్ష్మ, మధ్యంతర పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తులను ఈ కేంద్రం ద్వారా ఎంతో సులభంగా విదేశాలకు పంపుకోవచ్చని వివరించారు. https://dnk.cept.gov.in/customers.web/ కు కస్టమర్ లాగిన్ అయి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఆదిలాబాద్‌లోని ప్రధాన తపాలా కార్యాలయం పోస్టు మాస్టర్ కె.ఉత్తంను సెల్:7382070807లో సంప్రదించాలన్నారు.

కలప నిందితుడి బైండోవర్

కడెం: కలప స్మగ్లింగ్‌లో ప్రధాన నిందితుడైన మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన మెడిశెట్టి మహేశ్‌ను అటవీశాఖ అధికారులు గురువారం ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య ఎదుట బైండోవర్ చేశారు. మహేశ్ ఇటీవల కాలంలో రెండు కార్లలో అక్రమంగా కలపను తరలిస్తూ పట్టుబడ్డాడు. కలప అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎఫ్ఆర్వో అనిత హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్వోలు ప్రకాష్, సిద్ధార్థ, ఎఫ్‌బీవో ఆలీం ఉన్నారు.


తహసీల్దార్ ఎదుట నిందితుడు